క్లుప్తంగా

'గ్రూప్' అభ్యర్థులకు నష్టపరిహారం చెల్లించాలి

ఖమ్మంమయూరిసెంటర్: గత ప్రభుత్వం హయాంలో నష్టపోయిన గ్రూప్ 1, 2 అభ్యర్థులకు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.1.60 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని నాటి పీసీసీ అధ్యక్షుడు, నేటి సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రాకేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత పదేళ్ల నుంచి అభ్యర్థులు ఉద్యోగాలు రాక, నిరుద్యోగ భృతి లేక దిక్కుతోచని స్థితిలో జీవిస్తున్నారని, పని చేసేందుకు పని దొరక్క అవస్థలు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నష్టపోయిన నిరుద్యోగ అభ్యర్థులకు ఇచ్చిన హామీ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే మృతిపై మంత్రి తుమ్మల సంతాపం

ఖమ్మంవన్‌టౌన్: టీడీపీ సీనియర్ నాయకుడు, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఆయన స్వగ్రామం దొమ్మేరులో భౌతికాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. మంత్రి వెంట మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, నన్నపునేని రాజకుమారి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుచ్చిడి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

రాంరెడ్డి వెంకటరెడ్డి సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి: మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి అన్నారు. బుధవారం వెంకటరెడ్డి జయంతిని పురస్కరించుకుని పాతలింగాల గ్రామంలో నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాంరెడ్డి చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దమ్మాలపాటి సత్యనారాయణ, నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, ధనియాకుల హనుమంతరావు, షేక్ పత్తే అహ్మద్, మాలోతు సరిరాంనాయక్, చల్ల మల్లయ్య, ధరావత్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 24న ఖమ్మం మయూరి సెంటర్‌లో ఉన్న తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద నిర్వహించే తొలి తెలంగాణయోధుడు, కీర్తి శేషుడు కొలిశెట్టి రాందాస్ సంతాప సభను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్.కాంతేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తొలి, మలి దశ ఉద్యమకారులు అత్యధికంగా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జనరల్ బోగీల ఉద్యమంలో 'వనజీవి'



పోస్టుకార్డు రాస్తున్న వనజీవి రామయ్య

ఖమ్మం రూరల్: ప్రతీ రైలులో కనీసం ఐదు జనరల్ బోగీలు ఏర్పాటుచేయాలని సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రధానికి కోటి ఉత్తరాలు పంపించాలని నిర్ణయించగా, బుధవారం ఖమ్మం రూరల్ మండలంలో పద్మశ్రీ వనజీవి రామయ్యను కలిశారు. ఈసందర్భంగా ఆయన కూడా లేఖ రాసి ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 'టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్, న్యూఢిల్లీ-110011'చిరునామాకు ఉత్తరం పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గద్దం వెంకట్రామయ్య, సైదులు, ఉమేష్, శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కూసుమంచి: ఈనెల 24 నుంచి 31 వరకు నిర్వహించే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి అజితకుమారి తెలిపారు. తమ సెంటర్‌లో 68 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా.. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించబడుతుందన్నారు.

కోనోకార్పస్ మొక్కలు నరికివేత..

బోనకల్ రోడ్డు, ఖానాపురం చెరువు వద్ద నాటిన మొక్కలను తొలగించాలని ఆదేశం



బోనకల్ రోడ్డులోని మొక్కలను తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: హరితహారం కింద నగరంలో రెండు, మూడేళ్ల క్రితం కోనోకార్పస్ మొక్కలను నాటారు. అవి నాటిన నాటి నుంచి వాటిని తొలగించాలని నగర ప్రజలు డిమాండ్ చేసినా వాటిని తొలగించలేదు. దీంతో తాజాగా మున్సిపల్ అధికారులు కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో నగరంలోని ముస్తాఫనగర్ నుంచి ధంసలాపురం వరకు బోనకల్ రోడ్డులోని డివైడర్లు, ఖానాపురం చెరువు వద్ద నాటిన కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని కేఎంసీ అధికారులు డీఆర్ఎఫ్ సిబ్బందికి సూచనలు చేశారు. దీంతో బుధవారం డీఆర్ఎఫ్ సిబ్బంది మొక్కలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఇక నగరంలోని అన్ని ప్రాంతాల్లో కోనోకార్పస్ మొక్కలను తొలగించి, పర్యావరణహితానికి ఉపయోగపడేలా మొక్కలను నాటాలని నగర వాసులు కోరుతున్నారు.

ఆహార కల్తీని నిరోధించాలి



అదనపు కలెక్టర్‌కు అందించిన వినతిపత్రాన్ని చూపిస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు హోటళ్లు, కిరాణ షాపులు, పాల విక్రయ కేంద్రాల్లో ఆహార కల్తీ జరుగుతుందని, వంట గదుల నిర్వహణలో కనీస నియమాలను పాటించడం లేదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ అన్నారు. బుధవారం నగరంలో కల్తీ ఆహారంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాస్‌లైన్ ఆధ్వర్యాన అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకులు కనీస నిబంధనలను పాటించకుండా నాణ్యత లేని ఆహారాన్ని విక్రయిస్తున్నారన్నారు. కెమికల్స్ కలిపిన ఐస్ క్రీమ్‌లు, జ్యూస్‌లు విక్రయిస్తున్నారని వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఝాన్సీలక్ష్మి, నాయకులు కె.శ్రీనివాస్, ఆజాద్, లక్ష్మి, రాకేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే భావితరాల మనుగడ



మొక్కకు నీళ్లు పోస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు వారి మనుగడ కోసం మొక్కలు నాటి సంరక్షించడాన్ని అందరూ బాధ్యతగా స్వీకరించాలని పలువురు కోరారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని వెలుగుమట్ల అటవీపార్కుపరిసరాల్లో ఫారెస్ట్ రేంజర్ బెల్లం రాధిక, సెక్షన్ అధికారి వేణుమాధవ్, బీట్ అధికారి రమేష్, సామాజిక వేత్త కడవెండి వేణుగోపాల్ తదితరులు బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కల ఆవశ్యకతను వివరించిన వారు పలువురికి జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు.

'స్తంభాద్రి'లో శ్రీనృసింహ జయంతి

ఖమ్మంగాంధీచౌక్: వైశాఖ శుద్ధ చతుర్దశి స్వాతి నక్షత్రం సందర్భంగా నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం(గుట్ట)లో బుధవారం శ్రీనృసింహ జయంతి వేడుకను ఆలయ నిర్వాహకులు సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మంగళాయిద్యాలతో ప్రాతఃకాలార్చన, పానకాభిషేకం, శ్రీ సుదర్శన యాగం వంటి కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో అర్చకులు, పండితులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

పూజలు ప్రారంభం..

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం దేవాలయ ప్రధాన అర్చకులు ముడుంబ మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యాన యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, హోమం, తదితర పూజలు నిర్వహించారు.

నేడు కరెంట్ కోత

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక ఫీడర్, బావోజితండా సబ్‌స్టేషన్, మల్లేపల్లి ఫీడర్ల పరిధుల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు ఇందిరా, శ్రీనివాస్‌లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో కోయచలక పరిధిలో కోయచలక, రేగులచలక, శివాయిగూడెం, దారేడు తదితర గ్రామాలు, బావోజితండాపరిధిలో మల్లేపల్లి, పరికలబోడుతండా, జింకలతండా, తదితర గ్రామాలతో పాటు, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

శ్రీనగర్‌కాలనీలో..

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీనగర్‌కాలనీలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీనగర్ కాలనీలోని రోడ్డు నంబర్లు 9, 12, 13ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఖమ్మంఅ ర్బన్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పార్టీ మారేవారికి అవకాశం ఇవ్వొద్దు..



ప్రచారం చేస్తున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం/నేలకొండపల్లి: తమ స్వలాభం కోసం పార్టీలు మారేవారికి అవకాశం ఇవ్వొద్దని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి కోరారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్, ఎస్సీ స్టడీ సర్కిల్, వివిధ కళాశాలల్లో పట్టభద్రులతో పాటు విద్యావంతులతో సమావేశమైన సందర్భంగా ఆయన మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం సైద్ధాంతిక నిబద్ధతతో ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి గెలిపించాలని, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే భజన మండలిలో మరొక సభ్యుడు చేరడం తప్ప ప్రయోజనం ఉండదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పెద్దోళ్ల గంగారెడ్డి, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, రుద్రప్రదీప్, డాక్టర్ శీలం పాపారావు, నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొగర్తి సుధాకర్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల పట్టభద్రులు బీజేపీ వైపు చూస్తున్నారని, ఎమ్మెల్సీగా ప్రేమేందర్‌రెడ్డి గెలవడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మల్లెబోయిన గోవిందరావు, ఇస్లావత్ నాగేశ్వరరావు, కృష్ణారావు, గిరి, తంగేళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

12లోగా పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రాములు, పక్కన ఎంపీడీఓ తదితరులు

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనులను వచ్చే నెల 12 లోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని అమ్మ ఆదర్శ పాఠశాలలో జరిగే పనులను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ ఏపీఎం, కమిటీ ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతూ.. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.బడులు ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి బి.రాములు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏకరూప దుస్తులు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటూ పనుల పురోగతిని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఏఈలు కోటేశ్వరరావు, దేవేందర్, ఐకేపీ ఏపీఎం కె.అశోక్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలేరు ముఖ్యకార్యకర్తల సమావేశం

ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యాన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం పాలేరు నియోజకవర్గ ముఖ్యనాయకులతో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఎన్నికల పాలేరు ఇన్‌చార్జ్ రఘునాథ్ యాదవ్, మువ్వా విజయబాబు, మద్దినేని స్వర్ణకుమారి తదితరులు హాజరుకానున్నట్లు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యనాయకులు అందరూ సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాగా, ఖమ్మంలో జరిగే ముఖ్య నాయకుల సమావేశాన్ని విజయవంతం చేయాలని నేలకొండపల్లి మండలం నాచేపల్లిలో నాచేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు ముత్తినేని వీరయ్య బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కామేపల్లి: మండల పరిధిలోని గోవింద్రాల గ్రామానికి చెందిన ఉప్పరి నాగభూషి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బోడేపూడి వీరప్రతాప్ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, భిక్షపతి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోళ్లపై అప్రమత్తత అవసరం



ఊట్కూరులో అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శ్రీకన్య

కామేపల్లి: విత్తనాల కొనుగోళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖాధికారులు సూచించారు. బుధవారం మండలంలోని కామేపల్లి, ఊట్కూరు, తాళ్లగూడెం, పండితాపురం, లింగాల, మద్దులపల్లి, పొన్నేకల్ క్లస్టర్ల పరిధిలోని రైతులకు ఏఈఓలు నకిలీ విత్తనాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. లైసెన్సులు కలిగిన విత్తన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రశీదులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓలు శ్రీకన్య, మున్నీ, ప్రతిభ, ఉష, జగదీశ్వర్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించండి

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం వన్‌టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో సీపీఐ, సీపీఎం బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కోరారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌లు పదేళ్ల పాలనలో ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యాయని తెలిపారు. ఈనేపథ్యాన ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు తమ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తోందని చెప్పారు. నాయకులు జానీమియా, జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహరావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్, అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ టీజేఎస్, సీపీఐ, సీపీఎం, ఆప్, టీడీపీ పార్టీలు బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు మహ్మద్ జావీద్, ఎర్రా శ్రీకాంత్, తాటి వెంకటేశ్వర్లు, నల్లమోతు తిరుమలరావు, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఆదుకోవాలి..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని చిరు వ్యాపారులు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయానికి నోచుకోవడం లేదని, వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో బి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన చిరు వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ రంగం విస్తరించిన తర్వాత చిరు వ్యాపారులకు జీవనోపాధి కోల్పోతున్న నేపథ్యాన వారికి ఎటువంటి హామీ లేకుండా ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాక రేషన్‌కార్డులు ఇవ్వాలని, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కాగా, చిరు వ్యాపారుల కుటుంబాలకు సీపీఐ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో చిరు వ్యాపారుల సంఘం నాయకులు యూసఫ్, షాహబాద్, కరంసింగ్, కామేష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

కాబోయే ప్రధాని రాహుల్‌గాంధీనే..

ఖమ్మం మామిళ్లగూడెం: కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ అని బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో రాహుల్ గాంధీ గాలి వీస్తుందని తెలిపారు. బీజేపీ కులతత్వ, విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి గెలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడం.. పంట ఉత్పత్తుల ధరలు పెరగడంతో భూమి యజమానులు కూడా ఏటా కౌలు రేట్లు పెంచుకుంటూ పోతున్నారు. కొంత భూమి ఉన్న రైతులు మరికొంత కౌలుకి తీసుకుని సాగు చేద్దామనుకుంటే.. ఇప్పుడు పెరిగిన ధరలతో ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. పత్తి, మిర్చి, అపరాలతో పాటు వివిధ రకాల పంటలకు మార్కెట్‌లో మంచి ధరలు ఉండడంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇదే అదునుగా భావించి భూ యజమానులు కౌలు ధరలను అమాంతం పెంచేస్తున్నారు.



కౌలు కష్టాలు..!

వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన కౌలు రైతులు (ఫైల్)

కౌలు భూముల ధరలకు రెక్కలు

- ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.35వేల పైమాటే..
- నీరు, కరెంట్ సౌకర్యం ఉన్నవాటికే ప్రాధాన్యం
- పరతులతో కౌలుకిస్తున్న భూ యజమానులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

కామేపల్లి: మండలంలో గత ఐదేళ్ల క్రితం ఎకరామెట్ట భూమికి రూ.5 వేలు నుంచి రూ.10 వేల మధ్య ఉండే కౌలు ధర.. ఏటా భూ యజమానులు పెంచుతూ ఉండడంతో ప్రసుత్తం రూ.20 వేల నుంచి రూ.40 వేలకు చేరింది. కాగా, గతంలో నీటి లభ్యత అంతంత మాత్రంగా ఉండగా.. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం పేరుతో చెరువులు, కుంటలు బాగు చేయడంతో భూగర్భ జలాలు పెరిగి సాగు నీటికి కరువులేకుండా పోయింది. అలాగే వ్యవసాయరంగానికి 24 గంటల కరెంట్ ఇవ్వడంతో రైతులకు ఇబ్బంది లేకుండా సాగు చేసుకునేవారు. ఇలా అన్ని రకాల సదుపాయాలు ఉండడంతో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసేందుకు రైతులతో పాటు కౌలు రైతులు కూడా వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో కౌలు భూములకు రెక్కలొచ్చి ధరలు అమాంతం పెరిగాయి.

ఎకరాకు రూ.20 వేల పైమాటే..

మండల వ్యాప్తంగా దాదాపు 12 వేలకు పైగా రైతులు ఉండగా.. వీరిలో సుమారు 5 వేల నుంచి 6 వేల మంది వరకు కౌలు రైతులున్నారు. కౌలు రైతులు అత్యధికంగా మిర్చి పంట సాగుపై దృష్టి సారించి కౌలుకి తీసుకోనైనా పంట పండించేందుకు ఆసక్తి కనబరచడంతో కౌలు ధరలు పెంచుతూ పోతున్నారు. దీంతో చెల్లింపుల్లో ఆలస్యమైతే సన్నకారు రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి దాపురించింది. మిర్చికి మార్కెట్‌లో ఆశించిన ధర లభిస్తుండడంతో కౌలు తీసుకునేందుకు వెనకాడడం లేదు. ఈ ఏడాది మిర్చి, పత్తి దిగుబడి ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోయినా ఈసారైనా వస్తుందేమోనని ఒకే దఫాలో కౌలు చెల్లించి మరీ భూమిని తీసుకుంటున్నారు.

9 వేల ఎకరాల్లో మిర్చి సాగు..

మండల వ్యాప్తంగా రబీలో సుమారు 9 వేల ఎకరాల్లో మిర్చి తోట సాగు చేశారు. మిర్చి పంట సాగుకు పుష్కలంగా నీరు ఉండడం, పెట్టుబడి ఎక్కువ అయినప్పటికీ ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుండడంతో వ్యవసాయం రంగం వైపు మొగ్గు చూపిస్తోంది. దీంతో భూమిని కౌలుకి తీసుకున్న రైతులు ఎక్కువగా మిర్చి సాగు చేపట్టినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.


భూ యజమానులకే లబ్ధి..

గత ప్రభుత్వం భూ యజమానులకే అండగా నిలిచిందని, కౌలు రైతులకు మొండి చేయి చూపిందని కౌలు రైతులు వాపోతున్నారు. భూమిని కౌలుకు తీసుకున్నందుకు తాము ఎకరాకు రూ.20వేల నుంచి రూ.40 వేల వరకు కౌలు చెల్లిస్తుండగా.. గత ప్రభుత్వం కూడా భూమి యజమానులకే రైతుబంధు పేరిట ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.10 వేలు చెల్లించిందన్నారు. విత్తనాలు, ఎరువులు రేట్లు ధరలు పెరిగినా.. కొనుగోలు చేసి పంట వేస్తే.. నల్లి, తామర పురుగు, తెగుళ్ల కారణంగా పెట్టుబడి పెరగడంతో పాటు దిగుబడి తగ్గిపోతుందని చెబుతున్నారు. వాతావరణం అనుకూలించకపోవడం, మార్కెట్‌లో కూడా పంటలకు ఎప్పటికప్పుడు ధరల వ్యత్యాసం కారణంగా ఒక్కోసారి భారీగా నష్టపోవాల్సి వస్తుందని కౌలు రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వంపైనే ఆశలన్నీ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరిట భూ యజమానులకే ఆర్థిక సాయం అందించి కౌలు రైతులకు పట్టించుకోలేదు. దీంతో వేల మంది కౌలు రైతులకు నిరాశే ఎదురైంది. భూ యజమానులు కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తే తమకు నష్టమని భావించి ప్రసుత్తం కౌలుకి ఇచ్చినట్లు ఎటువంటి పత్రం కానీ ఇవ్వకుండా తమకే ప్రభుత్వ పెట్టుబడి సాయం అందాలని కండీషన్ పెట్టి మరీ భూమిని కౌలుకి ఇస్తున్నారు. ప్రభుత్వ సాయం అందిస్తుందో లేదో కానీ కౌలు భూమి లేకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని భూమి యజమానులు పెట్టే కండీషన్‌కు కట్టుబడి మరీ కౌలుకి తీసుకుంటున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో కౌలు రైతులుండగా.. ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

ఎకరానికి రూ.30 వేలు ఇచ్చా..



నాకు మొత్తం సుమారుగా 8 ఎకరాల భూమి ఉంది. నీటి సౌకర్యం ఉండడంతో ఒక ఎకరం రూ.30 వేలు చొప్పున గత ఏడాది కౌలుకిచ్చాను. ఈ ఏడాది ఇంకా కౌలుకి ఇవ్వలేదు. కానీ ఈ ఏడాది ఇంకా కౌలు పెరిగే అవకాశం ఉంది.

– అంబడిపూడి వెంకటేశ్వర్లు, రైతు, పండితాపురం

కౌలుకు తీసుకున్నా..



ఎకరం రూ.30 వేలు చొప్పున కౌలుకి తీసుకున్న. ఈ ఏడాది కౌలు పెంచే అవకాశం ఉంది. కౌలు రైతులకు గత ప్రభుత్వం మాదిరి కాకుండా ప్రస్తుత ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి అండగా నిలవాలి.

– దుద్దుకూరి నవీన్, రైతు, పండితాపురం